ఎండుతున్న మొక్కలు

- నీరుగారుతోన్న ప్రభుత్వ లక్ష్యం
- బాన్సువాడ అటవీ శాఖ రేంజ్ పరిధిలో నాటిన మొక్కలు చనిపోతున్న వైనం
- పట్టించుకోని అటవీ శాఖాధికారులు



కొమలంచ శివారులో ధ్వంసమైన బోర్డు


కొమలంచ శివారులో గతంలో మొక్కలు నాటిన ప్రదేశం

నిజాంసాగర్(జుక్కల్): జంగల్ బచావ్- జంగల్ బడావ్ అనే నినాదంతో అటవీ ప్రాంతాల్లోని ఖాళీ భూముల్లో తెలంగాణ ప్రభుత్వం హరితహారం, కంపా స్కీం కింద వేలాది మొక్కలు నాటింది. నిర్వహణ బాధ్యతలు సంబంధిత అధికారులు చూడక పోవడంతో నేడు ఆ మొక్కలు ఎండుతున్నాయి. బాన్సువాడ అటవీ శాఖ రేంజ్ పరిధిలో 12,899 హెక్టార్ల అటవీ ప్రాంతం ఉంది. 18 ఫారెస్ట్ బీట్లు ఉన్నాయి. ఆయా అటవీ ప్రాంతాల్లో తెలంగాణ హరితహారం కార్యక్రమంతో పాటు కంపా స్కీం కింద ప్రతీ ఏటా వందలాది మొక్కలు నాటారు. అలాగే మండలంలోని ముగ్దుంపూర్, కొమలంచ అటవీ శాఖ బీట్లల్లో మొక్కలు నాటారు. ముగ్దుంపూర్ బీట్‌లో కంపా స్కీం కింద 2,400 మొక్కలు నాటించారు. మంత్రి కేటీఆర్ బర్త్‌డే సందర్భంగా 2021లో వృక్షార్చన కార్యక్రమం పేరిట అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే హన్మంత్ సింధే, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ దఫేదార్ శోభ 2,400 మొక్కలు నాటారు. మొక్కలు నాటి, వాటి సంరక్షణ చర్యలు చేపట్టలేదు. దాంతో కొన్నాళ్లకే మొక్కలు ఎండిపోయాయి. అంతేకాకుండా అటవీ ప్రాంతంలో నాటిన మొక్కల వైపు బీట్ అధికారులు కన్నెత్తి చూడకపోవడంతో మొక్కల జాడ కరువైంది. అలాగే కొమలంచ అటవీ ప్రాంతంలో సైతం ఖాళీ భూముల్లో అధికారులు ప్లాంటేషన్ చేపట్టారు. వందలాది మొక్కలు నాటి వాటి సంరక్షణ చర్యలు తీసుకోలేదు. దాంతో మొక్కలకు నీళ్లు లేక ఎండిపోవడంతో పాటు పశువులకు ఆహారంగా మారాయి.

సంరక్షణ చర్యలు తీసుకుంటాం

అటవీ ప్రాంత భూముల్లో నాటిన మొక్కల సంరక్షణకు చర్యలు తీసుకుంటాం. హరితహారం, కంపా స్కీం కింద నాటిన మొక్కలు ఎండిపోవడానికి భూముల స్వభావం కారణమై ఉంటుంది. అడవుల్లోని కొన్ని చెట్లకు నీటి అవసరం ఉండదు.

– సంతోషి, బాన్సువాడ రేంజ్ అధికారిణి

వంద శాతం వసూళ్లే లక్ష్యం


సమావేశమైన మున్సిపల్ చైర్మన్ గంగాధర్

బాన్సువాడ టౌన్: ఈ ఆర్థిక సంవత్సరం ముగింపు వరకు వంద శాతం పన్నుల వసూళ్లే లక్ష్యంగా పని చేయాలని వార్డు ఆఫీసర్లకు మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్ సూచించారు. సోమవారం బాన్సువాడ మున్సిపాలిటీ కార్యాలయంలో ఆయన వార్డు ఆఫీసర్లు, సిబ్బందితో సమావేశం నిర్వహించి మాట్లాడారు. మున్సిపాలిటీ పరిధిలో ఉన్న 19 వార్డుల్లో కమర్షియల్ పన్నులు కూడా పూర్తి స్థాయిలో వసూలు చేయాలని సూచించారు. పన్నుల వసూలుకు వెళ్లే సమయంలో వార్డుల్లో నెలకొన్న సమస్యలను నమోదు చేసుకుని తమ దృష్టికి తీసుకొస్తే సమస్యను వెంటనే పరిష్కరించేందుకు వీలుంటుందని అన్నారు. సమావేశంలో కమిషనర్ రమేశ్, స్పీకర్ పీఏ భగవాన్‌రెడ్డి, వైస్ చైర్మన్ జుబేర్, తదితరులు ఉన్నారు.

జీపీ భవనానికి భూమిపూజ


ముగ్దుంపూర్‌లో భూమిపూజ చేస్తున్న సర్పంచ్

నిజాంసాగర్(జుక్కల్): ముగ్దుంపూర్‌లో జీపీ భవన నిర్మాణానికి సోమవారం గ్రామ సర్పంచ్ లక్ష్మీనారాయణ భూమిపూజ చేశారు. భవన నిర్మాణానికి ప్రభుత్వం రూ.20 లక్షలు మంజూరు చేసింది. కార్యక్రమంలో గాలీపూర్ సర్పంచ్ లక్ష్మారెడ్డి, నాయకులు లింగాల రాంచందర్, తదితరులు ఉన్నారు.

తాండూర్‌లో సీసీ రోడ్డు పనులు..

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): తాండూర్ శివారులోని త్రిలింగేశ్వరాలయం వద్ద సోమవారం సీసీ రోడ్డు పనులను ఎంపీపీ రాజ్‌దాస్, సర్పంచ్ గంగామణి, ఆలయ కమిటీ సభ్యులతో కలిసి ప్రారంభించారు. ప్రత్యేక పూజలు చేశారు. రూ.5 లక్షల నిధులతో రోడ్డు వేస్తున్నట్లు గ్రామ సర్పంచ్ గంగమణి తెలిపారు. ఆలయ కమిటీ చైర్మన్ దత్తు పాల్గొన్నారు.

క్లుప్తంగా

హైమాస్ట్ లైట్ల వితరణ

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): తాండూర్‌లోని త్రిలింగేశ్వరాలయానికి మండలంలోని లింగంపల్లికలాన్ గ్రామానికి చెందిన నీరుడి రాజు రూ. 2 లక్షల విలువ చేసే హైమాస్ట్ లైట్లను, ఇతర సామగ్రిని వితరణ చేశారు. మహాశివరాత్రి ఉత్సవాల నిర్వహణ కోసం నీరుడి రాజు ఆలయం వద్ద లైట్లను ఏర్పాటు చేయించారు.

కాంగ్రెస్ మండలాధ్యక్షుడిగా సురేందర్‌గౌడ్



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండల యూత్‌కాంగ్రెస్ అధ్యక్షుడిగా గోలిలింగాల గ్రామానికి చెందిన కలాలి సురేందర్ గౌడ్‌ను నియమించారు. ఈ మేరకు జిల్లా యూత్‌కాంగ్రెస్ అధ్యక్షుడు గజానన్ పటేల్, ఎల్లారెడ్డి నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సంపత్‌గౌడ్ చేతుల మీదుగా నియామకపు పత్రం అందజేశారు.

యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా గోవింద్

లింగంపేట(ఎల్లారెడ్డి): లింగంపేట మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా ముంబోజిపేట తండాకు చెందిన మథ్యూర గోవింద్‌ను నియమిస్తూ జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు గజానన్ పటేల్ సోమవారం నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం కార్యకర్తలు కృషి చేయాలన్నారు. యువతకు కాంగ్రెస్ పార్టీ ద్వారానే న్యాయం జరుగుతుందన్నారు. జిల్లా నాయకుడు సంపత్ గౌడ్, మండల పార్టీ అధ్యక్షుడు షరీఫ్ పాల్గొన్నారు.

పాఠశాల రికార్డుల పరిశీలన



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): నాగిరెడ్డిపేట గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలను సోమవారం మండల పంచాయితీ అధికారి(ఎంపీవో) శ్రీనివాస్ తనిఖీ చేశారు. ఈ సంర్భంగా పాఠశాలలోని పలు రికార్డులను ఆయన పరిశీలించారు. విద్యార్థులు క్రమం తప్పకుండా బడికి వచ్చేలా చర్యలు చేపట్టాలని ఉపాధ్యాయులకు ఆయన సూచించారు. సూచనలు, సలహాలు ఇచ్చారు.

ఆర్యవైశ్య సంఘం కార్యవర్గం


నాగరాజు మధుసూదన్ ఆంజనేయులు

భిక్కనూరు: పట్టణ ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా పబ్బ నాగరాజు, అధ్యక్షుడిగా గజవాడ నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా గంగెల్లి మధుసూదన్, కోశాధికారిగా కోడిప్యాక ఆంజనేయులు, ఉపాధ్యక్షులుగా అతిమాముల రమేశ్, పురాం రాజమౌళి, కోడిప్యాక వెంకటేశం, ముర్కి రాజేశం, గంగెల్లి శివ కుమార్, అల్లాడి రమేశ్, సహాయ కార్యదర్శులుగా అతిమాముల శ్రీనివాస్, గంజి శ్రీనివాస్, పబ్బ సాయినాథ్, కొండూరి శ్రీనివాస్, వలపుశెట్టి కైలాసం, ధన్నారపు శ్రీరాం, చీకోటి ప్రభాకర్, బూర్ల గుండయ్య, గౌరవ సలహాదారులుగా తాటికొండ క్రిష్ణమూర్తి, సలహాదారులుగా చీకోటి నాగభూషణం, చల్ల పెద్దమల్లేశం, శనిశెట్టి రాజలింగం, శెనిశెట్టి శ్రీనివాస్, అతిమాముల శ్రీధర్, చల్ల లక్ష్మణ్, ప్రోగ్రామ్ చైర్మన్‌గా బొందుగుల సత్యనారాయణలు ఎన్నికయ్యారు.

కాంగ్రెస్ గ్రామ కార్యవర్గం



మాచారెడ్డి: ఇసాయిపేటలో కాంగ్రెస్ పార్టీ గ్రామ కార్యవర్గాన్ని సోమవారం మాజీ మంత్రి షబ్బీర్‌అలీ సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ కమిటీ అధ్యక్షునిగా జగడం నర్సింలు, ఉపాధ్యక్షుడిగా ఓజె గంగయ్య, ప్రధాన కార్యదర్శిగా కొల్హాపూరం రాజయ్య, బీసీ కమిటీ అధ్యక్షుడిగా ఓజె గంగయ్య, సోషల్ విభాగం అధ్యక్షుడిగా చింత రాకేశ్, కిసాన్ సెల్ అధ్యక్షుడిగా కిషన్, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా ఐండ్ల సురేశ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యవర్గాన్ని షబ్బీర్‌అలీ అభినందించారు.

కమ్యూనిటీ హాల్‌కు నిధులు

పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలోని సరస్వతీ పాఠశాలలో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ.10 లక్షల ఎస్డీఎఫ్ నిధులు మంజూరయ్యాయని జెడ్పీటీసీ అరికెల శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. ఆయన సోమవారం పాఠశాలలో సిబ్బందికి నిధుల మంజూరుకు సంబంధించిన ప్రొసీడింగ్ కాపీని అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల సిబ్బంది మాట్లాడుతూ.. ఎమ్మెల్యే హన్మంత్ సింధే గతంలో ఇచ్చిన హామీ మేరకు నిధులు మంజూరు చేసినందుకు నేతలు కతజ్ఞతలు తెలిపారు. జొన్న శ్రీనివాస్‌రెడ్డి, రాములు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రగతికి కృషి చేయాలి


మాట్లాడుతున్న కాంప్లెక్స్ హెచ్చెం వహీద్ సిద్దిఖీ

లింగంపేట(ఎల్లారెడ్డి): విద్యార్థుల ప్రగతికి ప్రతీ ఉపాధ్యాయుడు కృషి చేయాలని కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు వహీద్ సిద్దిఖీ సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఉపాధ్యాయుల శిక్షణలో ఆయన మాట్లాడారు. ఫండమెంటల్ లిట్రసీ అండ్ న్యూమరసీ(ఎఫ్ఎల్ఎన్) కార్యక్రమంలో భాగంగా ఆయా పాఠశాలల ఉపాధ్యాయులతో సమీక్ష నిర్వహించారు. పాఠశాలల వారీగా విద్యార్థుల ప్రగతి సామర్థ్యాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నిర్వహించిన లెర్నింగ్ ట్రాక్ అప్‌డేషన్ ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. తల్లిదండ్రుల సమావేశాలు నిర్వహించే విధానంపై చర్చించారు.

చదవడం రాయడం రావాలి

తాడ్వాయి(ఎల్లారెడ్డి): ప్రాథమిక పాఠశాలలో చదివే విద్యార్థులకు ఇంగ్లీష్, తెలుగులో చదవడం రాయడం రావాలని ఎంఈవో రామస్వామి అన్నారు. తాడ్వాయి మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో సోమవారం ప్రధానోపాధ్యాయులకు కాంప్లెక్స్ సమావేశాన్ని నిర్వహించారు. ప్రాథమిక స్థాయి బోధించే ఉపాధ్యాయులకు పలు సలహాలు, సూచనలు చేశారు. సమావేశంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు వెంకట్‌రెడ్డి, నోడల్ అధికారి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరికలు



పిట్లం(జుక్కల్): కారేగాంకు చెందిన బీఆర్ఎస్ పార్టీ సహకార సంఘం డైరెక్టర్ రఘుపతి సతీష్ రెడ్డి సోమవారం గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో బీజేపీ కామారెడ్డి జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే అరుణతార సమక్షంలో పార్టీలో చేరారు. రఘుపతి సతీష్ రెడ్డికి బీజేపీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాలకుంట్ల రాము, అసెంబ్లీ కన్వీనర్ శ్రీధర్ , మండల అధ్యక్షుడు అభినయ్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సాయిరెడ్డి పాల్గొన్నారు.

కూలీల కొరతతో ఇబ్బందులు



రామారెడ్డి(ఎల్లారెడ్డి): డ్రైనేజీ పనులను శుభ్రం చేయడానికి కూలీల కొరత తీవ్రంగా వేధిస్తోందని రామారెడ్డి సర్పంచు సంజీవ్ అన్నారు. సోమవారం లింగంపేట మండలం వేగారం గ్రామానికి చెందిన కూలీలను తెచ్చి డ్రైనేజీలను శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా సర్పంచు మాట్లాడుతూ.. గ్రామంలో 14 వార్డులు, 15 వేలకు పైగా జనాభా, వందల సంఖ్యలో ఇళ్లు ఉండటంతో డ్రైనేజీలు అదే స్థాయిలో ఉన్నాయని, కూలీల కొరత ఉన్నప్పటికీ ఇతర గ్రామాల నుంచి కూలీలను తెప్పించి అన్ని వార్డుల్లో పనులను పూర్తి చేస్తున్నామన్నారు. సర్పంచు సంజీవ్, కార్యదర్శి క్రాంతి, కారోబార్ శ్రీధర్ దగ్గర ఉండి పర్యవేక్షించారు.

రేషన్ బియ్యం ఇవ్వడం లేదని ఫిర్యాదు



పిట్లం(జుక్కల్): రేషన్ బియ్యం రావడం లేదని తహసీల్ కార్యాలయంలో సోమవారం సిద్దాపూర్ గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. సిద్దాపూర్ గ్రామస్తులు మాట్లాడుతూ.. రెండు మూడు నెలలుగా గ్రామంలో సగం మంది లబ్ధిదారులకు మాత్రమే రేషన్ బియ్యం వస్తుందని, మిగితా సగం మందికి రేషన్ ఇవ్వడం లేదని వాపోయారు. సమస్యను పరిష్కరించి అందరికీ అందేలా చర్యలు తీసుకోవాలని స్థానిక తహసీల్దార్‌కు మొరపెట్టుకున్నారు.

పురుగు మందుల పిచికారీపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): పురుగు మందులు పిచికారీ చేసే విధానం గురించి వ్యవసాయ అధికారులు సోమవారం రైతులకు అవగాహన కల్పించారు. ఆజామాబాద్‌లోని రైతు వేదికలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పంటలకు పురుగు మందులు పిచికారి చేసే సమయంలో ఎదురు గాలికి మందులను పిచికారీ చేయవద్దని, పిచికారీ చేసే ముందు శరీరానికి కొబ్బరినూనె రాసుకోవాలన్నారు. ఏఈవో రాజాగౌడ్, రైతులు సాయిలు, పోచయ్య తదితరులున్నారు.

పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



మాచారెడ్డి: రైతులు ఉచిత పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మాచారెడ్డి జెడ్పీటీసీ మినుకూరి రామ్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కుంబాల రవిలు సూచించారు. సోమవారం పాల్వంచలో కామారెడ్డి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత పశు వైద్య శిబిరాన్ని వారు ప్రారంభించారు. గ్రామ సర్పంచ్ సునీత, ఎంపీటీసీ లావణ్య, తదితరులున్నారు.

డోంగ్లీలో..

మద్నూర్(జుక్కల్): డోంగ్లీలో వ్యవసాయ పరపతి సంఘం ఆధ్వర్యంలో పశువైద్య శిబిరం నిర్వహించారు. డీసీసీబీ జిల్లా డైరెక్టర్ శ్రీరాం పటేల్, బీఆర్ఎస్ డోంగ్లీ మండల అధ్యక్షుడు శశాంక్ పటేల్ పశువులకు ముద్ద చర్మ వ్యాధి నివారణ టీకాలు వేసి వైద్య శిబిరం ప్రారంభించారు. రైతులు తమ పశువులకు తప్పకుండ టీకాలు వేయించాలని పశు వైద్య అధికారి వినీత్ సూచించారు. వైస్ ఎంపీపీ జైపాల్‌రెడ్డి, తదితరులున్నారు.

కంటి వెలుగు శిబిరం ప్రారంభం


బుడ్మి శిబిరంలో ప్రజాప్రతినిధులు

బాన్సువాడ రూరల్: బుడ్మిలో సోమవారం వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. కామారెడ్డి జిల్లా రైతుబంధు అధ్యక్షులు అంజిరెడ్డి, సొసైటీ చైర్మన్ గంగుల గంగారాం , సర్పంచ్ లక్ష్మి నాందేవ్, ఎంపీటీసీ రుక్మిణి రవి తదితరులు కలిసి శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీవో సత్యనారాయణరెడ్డి, నాయకులు వెంకట్రాంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పిట్లంలో శిబిరం పరిశీలన


పిట్లంలో శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎంపీవో బ్రహ్మం

పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాన్ని సోమవారం ఎంపీవో బ్రహ్మం పరిశీలించారు. ఇప్పటి వరకు ఎంత మందికు కంటి పరీక్షలు నిర్వహించారని, ఎంత మందికి కంటి అద్దాలు అందజేశారని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. 47 రోజుల వరకు ఈ కంటి వెలుగు శిబిరం ఉంటుందని తెలిపారు. నాయకులు జొన్న శ్రీనివాస్‌రెడ్డి, కార్యదర్శి యాదగిరి పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

పెద్దకొడప్‌గల్(జుక్కల్): కంటి సమస్యలు ఉన్నవారు కంటి వెలుగు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ ఉమాకాంత్ అన్నారు. సోమవారం కుబ్యానాయక్ తండాలో రెండో రోజు కంటి సమస్యలున్న 101 మందికి పరీక్షలు చేసి మందులు అందజేసినట్లు సూపర్‌వైజర్ నాగమణి తెలిపారు.

బహిరంగ ప్రదేశాల్లో మూత్ర విసర్జన వద్దు



టాయిలెట్లపై ప్రచారం చేస్తున్న విద్యార్థులు

కామారెడ్డి టౌన్: బహిరంగ ప్రదేశాల్లో మలమూత్ర విసర్జనలు చేయవద్దని మున్సిపల్ సానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీందర్ సూచించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పబ్లిక్ టాయిలెట్స్ వద్ద మాస్టర్‌మైండ్ విద్యార్థులతో కలిసి టాయిలెట్ 2.0 క్యాంపెయిన్ కార్యక్రమం నిర్వహించారు. ప్రజలకు అవగాహన కల్పించారు. విద్యార్థులు ప్లకార్డులతో నినాదాలు చేశారు. పబ్లిక్ టాయిలెట్లను మాత్రమే ఉపయోగించుకోవాలని కోరారు. కామారెడ్డి పట్టణంలో కిలో మీటర్‌కి ఒకటి చొప్పున 14 పబ్లిక్ టాయిలెట్లను నిర్మించామని తెలిపారు. కామారెడ్డికి ఓడీఎఫ్ ప్లస్ సర్టిఫికెట్ పొందడానికి సహకరించాలని కోరారు.

సమాచారం..

■ నేడు ఉచిత వైద్య శిబిరం

కామారెడ్డి టౌన్: పట్టణంలోని శేషాద్రి స్కిన్ ఆస్పత్రిలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు వైద్యురాలు మణికుమారి సోమవారం తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఎన్జీవోస్ కాలనీలో ఉదయం నుంచి సాయంత్రం వరకు చర్మ సమస్యలపై పరీక్షలు చేస్తామన్నారు.

■ ఐటీఐ కళాశాలలో జాబ్ మేళా

బిచ్కుంద(జుక్కల్): మండల కేంద్రంలోని ఐటీఐ కళాశాలలో ఈ నెల 15న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ వెంకట్ శివరావు తెలిపారు. ఐటీఐ, పదవ తరగతి, ఇంటర్, డిగ్రీ చేసిన వారు జాబ్ మేళాలో పాల్గొనవచ్చని సూచించారు. బహుళజాతి కంపెనీలు వరుణ్ మోటర్స్, మహీంద్రా అండ్ మహీంద్రా కంపెనీలు వస్తున్నాయని అన్నారు. నిరుద్యోగులు ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఆధార్, బ్యాంక్ పాస్‌బుక్, పాస్‌పోర్టు ఫొటోలు తీసుకురావాలని సూచించారు.

■ 16 నుంచి విశ్వనాథేశ్వరస్వామి ఉత్సవాలు

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి విద్యానగర్ విశ్వనాథేశ్వరస్వామి ఆలయం తృతీయ వార్షికోత్సవాలు, మహా శివరాత్రి ఉత్సవాలు ఈ నెల 16 నుంచి 19 వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

■ 15న రోడ్డు పనులకు భూమిపూజ

బిచ్కుంద(జుక్కల్): మండల కేంద్రంలోని కందర్‌పల్లి, బాన్సువాడ రోడ్డు ఫోర్‌లైన్, సెంట్రల్ లైటింగ్ కోసం ఈ నెల 15న పనుల ప్రారంభోత్సవానికి భూమి పూజ చేయనున్నట్లు ఎంపీపీ అశోక్ పటేల్ తెలిపారు. ప్రారంభోత్సవానికి స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే హన్మంత్ సింధే, ఎంపీ బీబీ పాటిల్, జెడ్పీ చైర్మన్ శోభ హాజరుకానున్నారు. 2.7 కిలోమీటర్ల ఫోర్‌లైన్ రోడ్డు కోసం ప్రభుత్వం రూ.12 కోట్లు నిధులు మంజూరు చేసిందన్నారు.

ఆధ్యాత్మికం

■ ఘనంగా శివస్వాముల శోభాయాత్ర



దోమకొండ: మండల కేంద్రంలో శివస్వాముల శోభాయాత్ర సోమవారం ఘనంగా కొనసాగింది. గ్రామంలోని పలు వీధుల్లో శివస్వాముల నృత్యాలు మధ్య శోభాయాత్ర నిర్వహించారు. శివుడు, మునుల వేషధారణలతో శివస్వాములు ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో శివస్వాములు బత్తిని సిద్దరాములు, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

■ సాయిబాబా ఆలయ వార్షికోత్సవం



మద్నూర్(జుక్కల్): మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయం నిర్మించి ఎనిమిది ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఆలయ కమిటీ, గ్రామస్తుల ఆధ్వర్యంలో 8వ వార్షికోత్సవం వైభవంగా నిర్వహించారు. సోమవారం సాయిబాబా విగ్రహానికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి జల, పాలాభిషేకం కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయంలో భజన, కీర్తన, అన్నదాన కార్యక్రమాలు చేశారు. భక్తులు వేలాదిగా తరలిరావడంతో మద్నూర్‌లో సాయి నామస్మరణతో మారుమ్రోగింది.

■ ముగిసిన ఉత్సవాలు

దోమకొండ: మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయంలో మూడు రోజులుగా జరుగుతున్న సాయిబాబా ఆలయ వార్షికోత్సవాలు సోమవారం ఘనంగా ముగిశాయి. ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో మందిర నిర్మాణ దాత పాష్కంటి బాలయ్య, ఆలయ కమిటీ అధ్యక్షుడు నాగుల రాంచంద్రం, జెడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్, ఎంపీపీ కానుగంటి శారద, సర్పంచ్ నల్లపు అంజలి, ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

■ అంతంపల్లిలో బోనాల పండగ

భిక్కనూరు: అంతంపల్లిలో దళితులు బోనాల పండగను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భాజభజంత్రీలతో ముత్యాలమ్మకు బోనాలను సమర్పించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. ప్రజలకు పెద్ద ఎత్తున అన్నదానం చేశారు.

సంక్షిప్తం

ఆపదలో ఆపన్నహస్తం సీఎంఆర్ఎఫ్

బాన్సువాడ రూరల్: నిరుపేదల పాలిట సీఎం రిలీఫ్ ఫండ్ ఆపన్నహస్తంగా నిలుస్తోందని కామారెడ్డి జిల్లా రైతుబంధు అధ్యక్షుడు అంజిరెడ్డి అన్నారు. సోమవారం బుడ్మిలో లబ్ధిదారు జిన్న లక్ష్మికి మంజూరైన రూ. 45వేల చెక్కును సొసైటీ చైర్మన్ గంగుల గంగారాంతో కలిసి పంపిణీ చేశారు.

సీతారాముల కల్యాణానికి తలంబ్రాల అందజేత

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): అయోధ్య, భద్రాచలం సీతారాముల కల్యాణానికి చేతితో ఒలిచిన తలంబ్రాలను తయారు చేసి పంపుతున్నట్లు వైశ్యసంఘం మహిళలు సోమవారం తెలిపారు. తూర్పు గోదావరి జిల్లా కోరుకొండ గ్రామానికి చెందిన రైతులు, ఎవరి కాలు పడకుండా అకుంఠిత దీక్షతో, భక్తి శ్రద్ధలతో వరి పంటను పండించి ధాన్యాన్ని ఎల్లారెడ్డికి పంపినట్లు వారు తెలిపారు.

కేంద్ర పథకాలను ప్రజలకు వివరించాలి

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలని బీజేపీ మండల అధ్యక్షులు ఎస్ఎన్‌రెడ్డి అన్నారు. సోమవారం తిమ్మారెడ్డి గ్రామంలో తిమ్మారెడ్డి, తిమ్మారెడ్డితండా, రత్నాపూర్ బీజేపీ బూత్ కమిటీ ఇన్‌చార్జిలతో స్ట్రీట్ కార్నర్ మీటింగ్ నిర్వహించారు. బీజేపీ నాయకులు దేవేందర్, బాలకిషన్, విద్యాసాగర్ ఉన్నారు.

పల్లె ప్రకృతి వనం పరిశీలన

బిచ్కుంద(జుక్కల్): చిన్నదడ్గిలో సోమవారం పల్లె ప్రకృతి వనం, వన నర్సరీ, వర్మి కంపోస్టు షెడ్డును ఎంపీవో మహిబూబ్ పరిశీలించారు. కార్యదర్శికి పలు సూచనలు, సలహాలిచ్చారు. గ్రామంలో సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని సూచించారు. అనంతరం తెలంగాణ క్రీడా మైదానం కోసం స్థలం పరిశీలించారు.

వైకుంఠధామం పనులు..

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి పట్టణంలో నిర్మిస్తున్న వైకుంఠధామం పనులను మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ సోమవారం పరిశీలించారు. రూ.కోటి వ్యయంతో వైకుంఠ ధామం పనులను చేపట్టినట్లు ఆయన తెలిపారు. పనులను నాణ్యతగా చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు.

మధ్యాహ్న భోజనం..

ఎల్లారెడ్డి: జంగమాయిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఎంపీపీ మాధవి సోమవారం పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

సేవాలాల్ జయంతిని సెలవు దినంగా ప్రకటించాలి

రాజంపేట: లంబాడాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి రోజైన ఫిబ్రవరి 15న రాష్ట్ర ప్రభుత్వ సెలవు దినంగా ప్రకటించాలని సోమవారం లంబాడీల ఐక్య వేదిక మండల అధ్యక్షులు కాట్రోత్ సర్దార్ నాయక్ డిమాండ్ చేశారు. తండా పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

శాసనమండలి డిప్యూటీ చైర్మన్‌కు సన్మానం



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): శాసనమండలి డిప్యూటీ చైర్మన్‌గా ఎన్నికైన బండ ప్రకాశ్‌ను సోమవారం నాగిరెడ్డిపేపేట జెడ్పీటీసీ సభ్యుడు మనోహర్ రెడ్డి ఘనంగా సత్కరించారు. హైద్రాబాద్‌లోని శాసనమండలి ఛాంబర్‌లో ఆయనకు శాలువాను కప్పి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు సంతోష్‌రెడ్డి ఉన్నారు.